
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం | 20 | ఫిబ్రవరి | 2024



బంగారు గిన్నె, నత్తు సమర్పణ


ఇంద్రకీలాద్రి: విజయవాడ కనకదుర్గమ్మకు రావులపాలెం లూమీరైజ్ సంస్థ 113 గ్రాముల బంగారు గిన్నె, 6 గ్రాముల బంగారం, నవరత్నాలతో చేయించిన నత్తును సమర్పించింది.



రూ.1.01 లక్షల విరాళం

ద్వారకా తిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు బలుసు పుల్లారావు, స్వర్ణలత దంపతులు (ఏలూరు మండలం జోగన్నపాలెం) సోమవారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 8,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,550, మధ్య డెల్టాకు 1,650, పశ్చిమ డెల్టాకు 4,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10 అడుగులుగా కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

బల్క్‌మిల్క్ యూనిట్లలో పోస్టుల భర్తీకి చర్యలు

అమలాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పాల సేకరణ కేంద్రాల నిర్వహణ కోసం బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్ ఇన్‌చార్జి పోస్టుల నియామకానికి చర్యలు చేపట్టారు. దీనికిగాను 22న అమలాపురంలోని కలెక్టరేట్‌లో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.18 వేల నుంచి రూ.20 వేల వరకూ వేతనం ఉంటుందన్నారు. అభ్యర్థులు బీటెక్ ఫుడ్ టెక్నాలజీ, డెయిరీ సైన్స్ కోర్సులు చదివి ఉండాలని తెలిపారు. అదేవిధంగా 5 బీఎంసీయూ కెమిస్ట్ పోస్టులకు బీఎస్సీ కెమిస్ట్రీ అర్హత కలిగిన వారు అర్హులన్నారు. 8 క్షేత్రస్థాయి సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి బీఎస్సీ అగ్రికల్చర్, డెయిరీ, ఫుడ్ టెక్నాలజీ కోర్సులు చదివి ఉండాలన్నారు. ఐదు బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్ ఆపరేటర్ పోస్టులకు ఐటీఐ ఎలక్ట్రికల్, అండ్ రిఫ్రిజిరేషన్ కోర్సుల వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పూర్తి వివరాలతో గురువారం ఉదయం 10 గంటలకు స్థానిక కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో నిర్వహించే ఉద్యోగ మేళాకు హాజరుకావాలని హిమాన్షు శుక్లా విజ్ఞప్తి చేశారు.

వృత్తి నైపుణ్యం పెంచేందుకు బాటలు



ఆత్రేయపురంలో మాట్లాడుతున్న ఏఎల్ఎస్‌సీ కో ఆర్డినేటర్ రమేష్‌బాబు

రాయవరం: ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకునేందుకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు బాటలు వేస్తాయని సెక్టోరల్ అధికారులు అన్నారు. జిల్లాలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు, తెలుగు, గణితం, బయలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. ఆయా సమావేశాల్లో సమగ్ర శిక్షా ఆల్టర్నేటివ్ స్కూల్స్ కోఆర్డినేటర్ డి.రమేష్‌బాబు, ఏఎంఓ పి.రాంబాబు, ఏపీఓ డాక్టర్ ఎంఏకే భీమారావు, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధనా సామర్థ్యాలను పెంచుకోవాలన్నారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో వివిధ ఉపాధ్యాయుల ఇన్నోవేటివ్ బోధనా పద్ధతులను మిగిలిన వారు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మొత్తం 22 మండలాల్లో 44 ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు, ఎనిమిది చొప్పున సబ్జెక్టు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించారు. ఈ సమావేశాలు సంబంధిత మండల విద్యాశాఖాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల నేతృత్వంలో నిర్వహించగా, ప్రైమరీ పాఠశాలలు, సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మంగళవారం కూడా ప్రాథమిక పాఠశాలల, ఇంగ్లిష్, హిందీ, సోషల్, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు సబ్జెక్టు కాంప్లెక్స్ సమావేశాలు జరుగుతాయి.



కల్యాణోత్సవానికి తరలివచ్చిన భక్తులు



కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న పండితులు

కల్యాణ తేజం.. కన్నుల వైకుంఠం

- మూడు ముడులతో ఒక్కటైన స్వామి, దేవేరులు
- శోభాయమానంగా నారసింహుని కల్యాణం
- తన్మయత్వంతో మురిసిన అశేష భక్తజనం
- జనసంద్రంలా అంతర్వేది క్షేత్రం

సాక్షి, అమలాపురం/సఖినేటిపల్లి: నారసింహుని కల్యాణంతో వశిష్ట గోదావరి మురిసింది.. సాగర సంగమ పుణ్యక్షేత్రం.. అంతర్వేది పులకించింది. అల వైకుంఠం ఇలకు దిగివచ్చినట్లు కనిపించింది.. ఆ పావన సంరంభాన్ని చూడడానికా అన్నట్టు.. అలలు తోడుగా కడలి ఎగసెగసి పడింది. ఆది దేవుడు, భక్త వరదుడు అంతర్వేది లక్ష్మీనరసింహునితో శ్రీదేవీ భూదేవిల కల్యాణోత్సవం సోమవారం కన్నుల పండువగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను కల్యాణ వేదికపై ఉంచి నిర్వహించిన ఈ వేడుకను.. అసంఖ్యాకంగా తరలివచ్చిన భక్తులు తిలకించి పులకించారు. చెంతనే ఉన్న సముద్ర ఘోషతో పోటీ పడేలా భక్తజన గోవింద నామస్మరణలు.. వేదపండితుల మంత్రోచ్ఛారణలు ఆ ప్రాంగణంలో ప్రతిధ్వనించాయి. రంగురంగుల సుగంధ భరిత పుష్పాలతో శోభాయమానంగా తీర్చిదిద్దిన కల్యాణ వేదిక.. భారీ అలంకరణలు.. విద్యుద్దీప కాంతులతో పట్టపగటిని మించి దేదీప్యమానంగా ప్రకాశించిన అంతర్వేది పుణ్యక్షేత్రంలో లక్ష్మీనృసింహుని కల్యాణం.. ఆనంద పర్వంలా సాగింది.

అలా ప్రారంభమై..

స్వామివారి కల్యాణం రాత్రి 10 గంటలకు ఎదురు సన్నాహంతో ప్రారంభమైంది. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం శ్రీవారి తరఫున పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరుకు చెందిన రాజా కలిదిండి కుమార రామ గోపాలరాజా బహద్దూర్.. అమ్మవారి తరఫున అర్చకస్వాములు వివాహకర్తలుగా వ్యవహరించారు. ఆలయం నుంచి తొలుత స్వామిని, తరువాత అమ్మవార్లను వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల ఘోష నడుమ అర్చకులు, అధికారులు, మాజీ ట్రస్టీలు పల్లకిలో వేర్వేరుగా కల్యాణం మండపం వద్దకు తోడ్కొని వచ్చారు.

దేదీప్యమానంగా మెరిసి..

పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాల అలంకరణలు, విద్యుద్దీపాల కాంతుల్లో స్వామివారు, అమ్మవార్లు దేదీప్యమానంగా మెరిసిపోయారు. అర్ధరాత్రి 12.28 గంటలకు ఆరుద్రా నక్షత్రయుక్త వృశ్చిక లగ్న పుష్కరాంశలో స్వామివారి కల్యాణోత్సవం జరిగింది. వైష్ణవ సంప్రదాయ ప్రకారం వైఖానస ఆగమానుసారం ప్రధానార్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వెంకటశాస్త్రి పర్యవేక్షణలో అర్చక బృందం కల్యాణ క్రతువును నిర్వహించింది. ముహూర్తానికి జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని స్వామివారి శిరస్సుపై ప్రధానార్చకుడు కిరణ్, అమ్మవార్లు శ్రీదేవి, భూదేవి శిరస్సులపై సహాయ అర్చకులు ఉంచారు. స్వామి, అమ్మవార్లను బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఎప్పటిలానే శఠారి, వైరముడి, సూర్య పతకం, చిన్ని కిరీటం, వెండి కిరీటం, పాదా కిరీటం, కంటె, పచ్చలు, కెంపులు, వజ్రాలు పొదిగిన కిరీటం, హంస పతకం, నవరత్నాలు పొదిగిన హారం, పగడాల దండ, తొమ్మిది ఈస్ట్ ఇండియా మోహరీలు, 12 రకాల నానుతాడులు, చిన్ని లక్ష్మీ కాసుల పేర్లతో దేవతామూర్తులను ముస్తాబు చేశారు. అంతర్వేదికరకు చెందిన దివంగత డాక్టర్ పోతురాజు సూర్య వెంకట సత్యనారాయణ సమర్పించిన ఆభరణాలను సైతం అలంకరించారు. కల్యాణం జరిగినంత సేపూ స్వామివారి చెంతన రాజా కలిదిండి కుమార రామగోపాలరాజా బహద్దూర్ చేతులు కట్టుకుని నిలబడి స్వామివారిని కొలిచారు. ఆనవాయితీ ప్రకారం అన్నవరం, టీటీడీ దేవస్థానాల నుంచి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. నారసింహుని కల్యాణాన్ని రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణు, ఎమ్మెల్యేలు రాపాక వరప్రసాద రావు, కొండేటి చిట్టిబాబు, పొన్నాడ సతీష్, కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ ఎస్.శ్రీధర్, ఆర్డీఓ కేశవవర్ధనరెడ్డి, డీఎస్పీ కేవీ రమణ, దేవదాయ శాఖ డీసీ ఎం.విజయరాజు, ఏసీ వి.సత్యనారాయణ, జిల్లా ఏసీ డి.నాగమల్లేశ్వరరావు వీక్షించారు.

నేడు రథోత్సవం

అంతర్వేదిలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నూతన దంపతులుగా మూర్తీభవించిన స్వామి, అమ్మవార్లు రథంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ రథయాత్రలో సోదరి గుర్రాలక్క అమ్మవారికి చీర, సారెను, స్వామి వారి తరఫున అర్చకులు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది.

భక్తజన సంద్రం

కల్యాణోత్సవానికి జిల్లాతో పాటు పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లా వాసులే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచీ వచ్చిన అశేష భక్తజనం తరలి వచ్చారు. కల్యాణ మండపం వద్ద నిర్మించిన భారీ షెడ్లలో భక్తులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఆసీనులై ఉత్సవాన్ని వీక్షించారు. కల్యాణ వేదిక తోపాటు ఆరుబయట వీధులలో కూడా ఎల్ఈడీ స్క్రీన్లు పెట్టారు. వాటి వద్ద భక్తులు పెద్ద ఎత్తున చేరి కళ్యాణాన్ని తిలకించారు. ముందు జాగ్రత్తగా నరసాపురం – సఖినేటిపల్లి రేవుల మధ్య పంటు ప్రయాణాలను, పడవల మీద రాకపోకలను నిలుపు చేశారు.



కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు వచ్చిన మంత్రి వేణు, ఎమ్మెల్యేలు రాపాక, కొండేటి తదితరులు



స్వామివారి వాహన సేవలో భక్తజన కోలాహలం

‘స్పందన’ అర్జీలకు నాణ్యమైన పరిష్కారం

అమలాపురం రూరల్: స్పందన కార్యక్రమానికి వచ్చే ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా జిల్లా స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి భవన్‌లో జగనన్నకు చెబుదాం– స్పందన కార్యక్రమాలను నిర్వహించారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, శిక్షణ ఐపీఎస్ రోహిత్‌కుమార్ చౌదరిలు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు– పేదలందరికీ ఇళ్ల పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పింఛన్లు, సర్వే, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి మొత్తం 229 అర్జీలు వచ్చాయి. డ్వామా పీడీ ఎస్. మధుసూదన్, నోడల్ అధికారి కె.భీమేశ్వరరావు, డీపీఓ వి.కృష్ణకుమారి, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి పి.జ్యోతిలక్ష్మీ దేవి, డీఎస్ఓ ఎ.పాపారావు, పౌరసరఫరాల జిల్లా సహాయ మేనేజర్ నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు, వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్ పాల్గొన్నారు.



స్పందనలో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

సీఎం జగన్ మానసపుత్రిక వలంటీర్ వ్యవస్థ

- మంత్రి పినిపే విశ్వరూప్
- ఎల్లలు దాటిన సేవలు



సేవా వజ్రకు ఎంపికైన వలంటీర్‌ను సత్కరిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు

అల్లవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానసపుత్రిక వలంటీర్ వ్యవస్థ అని మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. సోమవారం అల్లవరం మండలం గుడ్డివానిచింత సత్యకస్తూరి ఫంక్షన్ హాల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అధ్యక్షతన నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వలంటీర్ సేవలను ప్రపంచ దేశాలు కీర్తిస్తున్నాయన్నారు. కరోనా సమయంలో వీరు అందించిన సేవలను రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మరచిపోరని తెలిపారు. ఈ వ్యవస్థ ద్వారా 2.40 లక్షల మంది గడప గడపకూ వెళ్లి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, 99 శాతం పథకాలు వీరి ద్వారా లబ్ధిదారులకు చేరుతున్నాయన్నారు. ఎన్నికల హామీలన్నీ అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రచారాలు, ఆర్భాటాలు తప్ప ప్రజా పాలనను గాలికి వదిలేశారని మంత్రి విమర్శించారు. జాబు కావాలంటే బాబు రావాలని ఊదరగొట్టిన టీడీపీ తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులను నిండా ముంచిందని, డ్వాక్రా మహిళలను రుణమాఫీ పేరిట మోసం చేసిందని మంత్రి గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజలను మళ్లీ మోసం చేయడానికి చంద్రబాబు, పవన్‌లు కలసి వస్తున్నారని అన్నారు. ఎంపీ అనురాధ మాట్లాడుతూ వలంటీర్లపై సీఎం జగన్‌కు అపార నమ్మకం ఉందని, సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఈ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయన్నారు. అందుకే వలంటీర్లపై అనాలోచిత వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. ప్రతిపక్షాల కుట్రను వలంటీర్లు తిప్పు కొట్టాలని ఎంపీ పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి వలంటీర్లు మూల స్తంభాలని, సేవే లక్ష్యంగా సాగుతున్నారన్నారు. అనంతరం సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్రలకు ఎంపికైన వలంటీర్లను శాలువాలతో సత్కరించి, ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దంగేటి డోలామణి, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, జీవీకే చైర్మన్ తిక్కా ప్రసాద్, నాయకులు పినిపే శ్రీకాంత్, తుని నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీను, జిల్లా కార్యదర్శి మెరికల శ్రీను, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకటరావు, సర్పంచ్ బొమ్ము బాలవేణి పాల్గొన్నారు.

రత్నగిరిపై భక్తుల రద్దీ

- భీష్మ ఏకాదశి ఎఫెక్ట్
- సాయంత్రం నుంచే పోటెత్తుతున్న భక్తులు

అన్నవరం: భీష్మ ఏకాదశి పర్వదినాన కోరిన కోర్కెలు తీర్చే సత్యదేవుని దర్శించుకునేందుకు భారీ సంఖ్యలో భక్తులు రత్నగిరికి తరలి వస్తున్నారు. సోమవారం సాయంత్రం నుంచి వేలాదిగా భక్తులు రావడం ప్రారంభమైంది. దీంతో ఆలయ ప్రాంగణం, విశ్రాంతి మండపాలన్నీ భక్తులతో నిండిపోయాయి. రాత్రి 8 గంటల సమయానికే సుమారు 10 వేల మంది భక్తులు వచ్చారు. వీరందరూ రామాలయం పక్కన ఉన్న విశ్రాంతి షెడ్డులో బస చేశారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ భక్తుల రాక కొనసాగనుంది.

విస్తృత ఏర్పాట్లు

భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా సత్యదేవుని దర్శనానికి భారీగా భక్తులు రానున్న నేపథ్యంలో రత్నగిరిపై విస్తృత ఏర్పాట్లు చేశారు. సత్యదేవుని ప్రధాన ఆలయం, దిగువన యంత్రాలయం, ధ్వజస్తంభం, అనివేటి మండపం వద్ద ఆలయ ప్రాంగణాన్ని రంగురంగుల పుష్ప మాలికలతో అలంకరించారు. ఆలయాన్ని మంగళవారం వేకువన రెండు గంటలకే తెరచి, పూజల అనంతరం స్వామివారి దర్శనానికి భక్తులను అనుమతించాలని, ఆ సమయానికే వ్రతాల నిర్వహణ కూడా ప్రారంభించాలని నిర్ణయించారు.



సత్యదేవుని ఆలయం

సత్య మందిరం.. స్వర్ణ వైభవం

- ఆలయ శిఖరం స్వర్ణతాపడానికి చురుకుగా సన్నాహాలు
- 11.50 కిలోల బంగారం అవసరమని అంచనా
- రూ.7.5 కోట్లతో ప్రతిపాదనలు

అన్నవరం: రత్నగిరి వాసుడు, భక్తుల పాలిట కొంగు బంగారంగా ప్రసిద్ధికెక్కిన సత్యదేవుని ఆలయ శిఖరం (గర్భగుడి) త్వరలోనే స్వర్ణకాంతులు వెదజల్లనుంది. ఆలయ శిఖరానికి బంగారు రేకు తాపడం చేయాలంటూ అన్నవరం దేవస్థానం ధర్మకర్తల మండలి రెండు నెలల క్రితం తీర్మానం చేసింది. ఆ మేరకు దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ అనుమతి కోరుతూ దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈఓ) కె.రామచంద్ర మోహన్ ప్రతిపాదనలు పంపించారు. దీనికి కమిషనర్ త్వరలోనే అనుమతి ఇవ్వనున్నారని సమాచారం.

పరిశీలించిన స్థపతి

ఇప్పటికే తిరుమల వేంకటేశ్వరస్వామి, శ్రీశైలం భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి, విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ శిఖరాలు స్వర్ణ శోభతో భక్తులను ఆనందపరవశుల్ని చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే సత్యదేవుని ఆలయ శిఖరాన్ని కూడా స్వర్ణమయం చేయాలని నిర్ణయించారు. దీనికి 11.5 కిలోల బంగారం అవసరమవుతుందని, బంగారం, ఇతర ఖర్చులు కలిపి మొత్తం రూ.7.5 కోట్ల వ్యయమవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఆ మేరకు సత్యదేవుని ఆలయ శిఖరాన్ని దేవదాయ శాఖ ప్రధాన స్థపతి పరమేశ్వరప్ప కొద్ది రోజుల కిందట పరిశీలించారు. ఆలయ శిఖరాన్ని స్వర్ణమయం చేసేందుకు సంబంధించిన కొలతలు తీసుకున్నారు. సుమారు 10 అడుగుల వెడల్పు, 12 అడుగుల ఎత్తు కలిగిన ఈ ఆలయ శిఖరంపై సుమారు 50కి పైగా దేవతా శిల్పాలున్నాయి. వీటన్నింటినీ కొలతలు తీసి, తొలుత రాగి రేకుతో వీటి కవచాలు తయారు చేసి, వాటిపై బంగారు పూత పూస్తారని అధికారులు తెలిపారు.

13వ వసంతంలోకి నూతన ఆలయం

రత్నగిరిపై సత్యదేవుడు 1891లో (ఖర నామ సంవత్సరం) శ్రావణ శుద్ధ విదియ నాడు ఆవిర్భవించినట్టు ఆలయ చరిత్ర ద్వారా తెలుస్తోంది. ఈ పుణ్యక్షేత్రంలో స్వామివారు ఆవిర్భవించి 133 సంవత్సరాలు పూర్తయ్యింది. అప్పటి ఆలయం శిథిలావస్థకు చేరడంతో 2011లో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, ఈశ్వరుల మూలవిరాట్టులకు పకడ్బందీ రక్షణ ఏర్పాట్లు చేసి, పాత ఆలయాన్ని తొలగించి, నూతన ఆలయాన్ని నిర్మించారు. కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు జయేంద్ర సరస్వతి స్వామి చేతుల మీదుగా 2012 మార్చి 14న కలశ స్థాపన చేసి, నూతన ఆలయాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచీ తెలుగు తిథుల ప్రకారం ఫాల్గుణ బహుళ సప్తమి నాడు నూతన ఆలయ కలశ ప్రతిష్ఠ వార్షికోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి నూతన ఆలయం 13వ వసంతంలోకి ప్రవేశించనుంది. నాడు నూతన ఆలయ నిర్మాణ సమయంలోను, నేడు కూడా ఇక్కడ ఈఓగా రామచంద్ర మోహనే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆలయ శిఖరాన్ని బంగారుమయం చేసే పనులను కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని, త్వరలోనే ముహూర్తం నిర్ణయించి విరాళాల సేకరణకు శ్రీకారం చుట్టాలని భావిస్తున్నారు.

దాతల విరాళాలతో..



నూతన ఆలయాన్ని మొత్తం గ్రానైట్‌తో నిర్మించాలని తొలుత అనుకున్నాం. అయితే, భవిష్యత్తులో స్వర్ణతాపడం చేసే ఆలోచనతో ఆలయాన్ని మాత్రమే గ్రానైట్‌తో నిర్మించి, శిఖరాన్ని మాత్రం ఇటుకలతో నిర్మించాం. స్వర్ణ తాపడం ప్రతిపాదనలను దేవదాయ శాఖ కమిషనర్‌కు పంపించాం. త్వరలోనే అనుమతులు రానున్నాయి. భక్తుల విరాళాలతోనే స్వర్ణతాపడం చేయిస్తాం. భక్తులు రూ.వెయ్యి నుంచి ఎంత మొత్తం విరాళం ఇచ్చినా స్వీకరించేలా ఒక స్కీము రూపొందించనున్నాం. విరాళాలు ఇచ్చేందుకు భక్తులు కూడా ఆసక్తి చూపుతున్నారు. కొంత మంది పెద్ద దాతలు కూడా ముందుకు వస్తున్నారు. అతి త్వరలోనే విరాళాల సేకరణను లాంఛనంగా ప్రారంభిస్తాం. స్వర్ణతాపడానికి అవసరమైన మొత్తంలో దాదాపు సగం సమకూరిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– కె.రామచంద్ర మోహన్, ఈఓ, అన్నవరం దేవస్థానం

క్లుప్తంగా

బంగారు ఆభరణాల చోరీ

సామర్లకోట: బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లి వస్తున్న మహిళ పర్సులో నగదు, బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. సామర్లకోట పోలీసుల కథనం ప్రకారం.. చంద్రేడు రాయవరం గ్రామానికి చెందిన తమ్మన కృష్ణవేణి రామచంద్రపురంలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లి తిరుగు వస్తూ సోమవారం సామర్లకోట బస్సు కాంప్లెక్స్‌కు చేరుకుంది. తర్వాత సామర్లకోట నుంచి రాజమహేంద్రవరం వెళ్లే బస్సు ఎక్కింది. ఆ బస్సు స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం చేరుకొన్న తరువాత పర్సును పరిశీలించగా నగదు, నగలు కనిపించలేదు. దాంతో చోరీపై కండక్టర్‌కు సమాచారం ఇచ్చింది. దాంతో బస్సును సామర్లకోట పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీసులు బస్సులో ప్రయాణికుల బ్యాగ్‌లను తనిఖీ చేసినా ఫలితం కనిపించలేదు. ఈ మేరకు ఆమె సామర్లకోట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పర్సులో రూ. ఐదు వేలు, మూడు బంగారు ఉంగరాలు, నెక్లెస్ ఉన్నాయని కృష్ణవేణి పేర్కొన్నారు.

సిమెంట్ దిమ్మెను ఢీకొన్న వ్యాన్: క్లీనర్ మృతి


మృతుడు చైతన్య దార్వా (ఫైల్)

దేవరపల్లి: సిమెంట్ దిమ్మెను వ్యాన్ ఢీకొట్టిన సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలైన సంఘటన దేవరపల్లి మండలం కృష్ణంపాలెం జాతీయ రహదారిపై జరిగింది. దేవరపల్లి ఎస్సై కె.శ్రీహరిరావు కథనం ప్రకారం.. భీమవరం నుంచి విశాఖపట్నం వెళుతున్న వ్యాన్ సోమవారం తెల్లవారుజామున కృష్ణంపాలేనికి వచ్చేసరికి నిద్ర మత్తులో డ్రైవర్ సిమెంట్ దిమ్మెను ఢీకొట్టాడు. వ్యాన్ క్లీనర్ చైతన్య దార్వా (40) అక్కడికక్కడే మృతి చెందగా, వ్యాన్‌పై ఉన్న మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరికి గోపాలపురం సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స చేయించారు. భీమవరంలో ఓ వివాహ వేడుకకు సామగ్రి తీసుకెళ్లి, తిరిగి విశాఖపట్నం వెళుతుండగా ఈ సంఘటన జరిగింది.

హత్యాయత్నం కేసులో నలుగురికి జైలు

కాకినాడ లీగల్: హత్యాయత్నం చేసిన కేసులో నలుగురికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ కాకినాడ రెండో అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎంవీఎస్ పద్మజ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కాకినాడ గొడారిగుంట, సీతారామ్‌నగర్‌కు చెందిన గొల్లపల్లి దుర్గాలు, తన భార్య గొల్లపల్లి రమణ, కొండ వెంకటేష్, అతని భార్య కొండ మణికంఠలు కలసి డ్రైనేజీ గొడవ విషయంలో ఇంటి పక్కన ఉన్న తల్లిబోయిన వెంకన్న, అతని బావమంది కటారి శ్రీనులపై గునపంతో తలపై కొట్టి దాడి చేశారు. 2020 అక్టోబర్ 29న బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై సర్పవరం పోలీసు కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో గొల్లపల్లి దుర్గాలుపై నేరం రుజువు కావడంతో మూడేళ్ల జైలు, రూ.10 వేల జరిమానా, అలాగే గొల్లపల్లి రమణ, కొండ వెంకటేష్, కొండ మణికంఠకు ఒక్కొక్కరికి రెండేళ్ల జైలు, రూ. 3 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

శుభ సమయాన..

మోగేను కల్యాణ వీణ

కల్యాణ తిలకం దిద్దుకున్న స్వామివార్లు పరిణయానికి సిద్ధమయ్యారు.. భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉమ్మడి జిల్లాల్లోని ప్రముఖ దేవాలయాల్లో ఈ వేడుకలు వైభవంగా జరగనున్నాయి.. ఈ ఘట్టాలను అశేష భక్తజనం వీక్షించేందుకు ఇప్పటికే అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు.. పెదపూడిలోని సూర్యనారాయణమూర్తి, పుట్టకొండ లక్ష్మీ నరసింహస్వామి, ధవళేశ్వరం జనార్దనస్వామి, ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆ ఏర్పాట్లు, విశేషాల గురించి తెలుసుకుందాం రండి..

- నేడే స్వామివార్ల పరిణయ ఘట్టాలు
- కల్యాణ కాంతులతో మెరుస్తున్న ఆలయాలు
- అన్ని ఏర్పాట్లూ చేసిన అధికారులు


జి.మామిడాడలో సూర్యదేవాలయ గోపురం

పెదపూడి: జి.మామిడాడలోని శ్రీసూర్యనారాయణమూర్తి ఆలయంలో స్వామివారి కల్యాణం మంగళవారం అట్టహాసంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాన్ని త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి మంగళ శాసనాలతో వైభవంగా జరుపనున్నారు. దీనికిగాను ఆలయ ఈఓ మోర్త మురళీ వీరభద్రరావు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొవ్వూరి శ్రీనివాసా బాలకృష్ణారెడ్డి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు భారీ ఏర్పాట్లు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే దృష్ట్యా ఎలాంటి ఇబ్బంది రాకుండా చూస్తున్నారు. భారీ బాణసంచా పోటీలకు ఏర్పాట్లు జరగ్గా, ఇందులో విజేతలకు కాసు బంగారం బహుమతిగా అందించనున్నారు.

జరిగే కార్యక్రమాలివి..

ఈ నెల 16న రథసప్తమితో ప్రారంభమైన స్వామివారి కల్యాణోత్సవాలు 25తో ముగుస్తాయి. మంగళవారం స్వామివారి కల్యాణం సందర్భంగా ఉదయం 5 గంటలకు నిత్యోపాసన, విశేష హోమం, బలిహరణ, 8 గంటలకు ధ్వజారోహణ, 9 గంటలకు మార్కెట్ సెంటర్లో భారీ అన్న సమారాధన జరుగుతుంది. మధ్యాహ్నం ఒంటి గంటకు శ్రీవారి రథోత్సవం, రాత్రి 7 గంటలకు స్వామివారి కల్యాణం ప్రారంభమవుతుంది. 21న ఉదయం, సాయంత్రం నిత్యార్చన, హోమాలు, బలిహరణ, 22న సాయంత్రం నాలుగు గంటలకు శ్రీవారికి సదస్య మహోత్సవం, 23న గరుడ వాహన తిరువీధి ఉత్సవం, 24న ఉదయం 8 గంటలకు తుల్యాభాగ నదీ తీరాన స్వామివారి చక్రస్నానం, 25న రాత్రి 7 గంటలకు అద్దాల శయన మందిరంలో ఉయ్యాల సేవ, శ్రీపుష్పయాగ మహోత్సవం నిర్వహిస్తారు. దేశంలో అనేక చోట్ల సూర్య దేవాలయాలు ఉన్నప్పటికీ ఇక్కడ మాత్రమే వైష్ణవ సంప్రదాయం ప్రకారం పూజలు చేయడం ప్రత్యేకత. నాలుగు అంతస్తులతో శిలా కావ్యాలను ఆలయంలో నిర్మించారు. అన్నవరం తర్వాత గొల్లల మామిడాడ ఆలయంలోనే అధిక సంఖ్యలో వివాహాలు జరుగుతున్నాయి.


ప్రత్యేక అలంకరణలో ఉష, పద్మిని, ఛాయ, సౌంజ్ఞ సమేత సూర్యభగవానుడు


ధవళేశ్వరంలో జనార్దనస్వామి ఆలయం (అంతర చిత్రం) శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీజనార్దనస్వామి

జై జనార్దన..

ధవళేశ్వరం: నవ జనార్దనస్వామి ఆలయాల్లో ప్రథమం ధవళేశ్వరంలోని జనార్దనస్వామి ఆలయం. ఇక్కడ మంగళవారం నుంచి 25వ తేదీ వరకూ స్వామివారి కల్యాణోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. తొలి మధ్యాహ్నం 3.30 గంటలకు స్వామివారి రథోత్సవం ప్రారంభమవుతుంది. రథం వీధి నుంచి స్థానిక పోలీస్ స్టేషన్ వరకూ రథోత్సవం కనుల పండువగా సాగనుంది. రాత్రి 9 గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు. ఈ వేడుకను తిలకించేందుకు ఉభయ గోదావరి జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారు. ఈ ఏర్పాట్లను జిల్లా ఇన్‌చార్జి మంత్రి, బీసీ సంక్షేమ, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కో–ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు.

కష్టాలు తొలగుతాయని..

రథోత్సవంలో స్వామివారి రథాన్ని లాగితే కష్టాలు తొలగుతాయని భక్తుల విశ్వాసం. రథంపై కట్టే గొడుగును భక్తులు అరటి పండ్లతో కొట్టడం ఇక్కడ ఆనవాయితీ. గొడుగుకు తాము వేసే అరటి పండ్లు తగిలితే శుభం జరుగుతుందని ప్రజల నమ్మకం. ధవళగిరిపై కొలువైన స్వామివారి ఆలయానికి పక్కన కాశీకి వెళ్లే మార్గం ఉండేదని పూర్వీకులు చెబుతుంటారు. ఈ మార్గాన్ని కాలక్రమంలో మూసివేసి సంతాన గోపాలస్వామి వారిని ప్రతిష్ఠించారు. సంతానం లేనివారు ఇక్కడ స్వామి వారిని దర్శించుకుంటే సంతానం కలుగుతుందని నమ్మకం. కొండ దిగువన అగస్త్యేశ్వరస్వామి, విద్యాధరేశ్వరస్వామి ఆలయాలు ప్రసిద్ధి చెందాయి.


ఉత్సవమూర్తులు లక్ష్మీ నరసింహస్వామి, గోదాదేవి, వేంకటేశ్వరస్వామివారు


పుట్టకొండలో లక్ష్మీనరసింహ స్వామి ఆలయం

పుట్టకొండ.. ఆధ్యాత్మికతే నిండా

పెదపూడి: పుట్టకొండలోని లక్ష్మీనరసింహ స్వామివారి దివ్య కల్యాణోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి సీహెచ్‌వీ రమణమూర్తి, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ పి.అనంతాచార్యులు తెలిపారు. మంగళవారం తీర్థం, భారీ అన్నదానం నిర్వహిస్తారు. తెల్లవారు జామున 3 గంటలకు స్వామివారికి సుప్రభాత సేవ, 4 గంటలకు పంచామృతాభిషేకం, 5 గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనం ఉంటుంది. 8.30 గంటలకు ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అనంతాచార్యులు ఆధ్వర్యంలో సుమారు 160 మంది శ్రీవైష్ణవ స్వాములచే సంప్రదాయ అర్చన, మధ్యాహ్నం 3 గంటలకు స్వామివారి రథోత్సవం జరుగుతుంది. రాత్రి 10 గంటలకు గరుడ, పుష్పక వాహన సేవలు, బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు స్వామి కల్యాణం నిర్వహిస్తారు. 21న స్వామివారికి నిత్యహోమం, బలిహరణ, 22న గజవాహన సేవ, 23న అశ్వవాహన సేవ, 24న చక్రతీర్థం, 25న శ్రీపుష్పయాగం తదితర కార్యక్రమాలు ఉంటాయి. ఈ స్వామిని దర్శిస్తే సర్వశుభాలు చేకూరతాయని ఆలయ అర్చకులు తెలిపారు.

భీమేశ్వరుని కల్యాణం చూతమురారండి..

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి వార్ల దివ్య కల్యాణం మంగళవారం రాత్రి 10.25 గంటలకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి స్వామి, అమ్మ వార్లకు పట్టు వస్త్రాలను అధికారులు సోమవారం అందజేశారు. ఆలయంలో వేంచేసి ఉన్న మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి, లక్ష్మీ సమేత నారాయణస్వామి, చండికా సమేత సూర్యేశ్వర స్వామివార్ల దివ్య కల్యాణం జరుపనున్నారు. ఉదయం 5.45 గంటలకు కల్యాణ మూర్తులను ఆహ్వానించడం, 8 గంటలకు దాతలు శ్రీవెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ అధినేత సత్తి సుబ్బారెడ్డి, సీతారత్నం దంపతులచే లక్ష రుద్రాక్ష పూజ, సాయంత్రం 5 గంటలకు నంది వాహనంపై కల్యాణ మూర్తుల నగరోత్సవం నిర్వహించనున్నారు.


ఆలయ ఈఓ తారకేశ్వరరావుకు కల్యాణ పట్టువస్త్రాలు అందజేస్తున్న టీటీడీ అధికారులు

వేటకెళ్లి మత్స్యకారుడి మృతి


వెంకటేశులు (ఫైల్)

కరప: సముద్రంలోకి వేటకెళ్లిన మత్స్యకారుడు బోటులోనే గుండెపోటుతో మరణించిన ఘటన కరప మండలం ఉప్పలంకలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఉప్పలంక గ్రామానికి చెందిన పెసంగి వెంకటేశులు (52) సోమవారం తెల్లవారుజామున సహచర మత్స్యకారులతో కలసి బోటులో సముద్రంలో వేటకు వెళ్లాడు. వేట సమయంలో గుండెలో నొప్పిగా ఉందని వెంకటేశులు చెప్పడంతో వెంటనే సహచరులు బోటును ఒడ్డుకు చేర్చేందుకు వేగంగా వస్తుండగా మార్గ మధ్యంలో మరణించాడు. మృతునికి భార్య చంద్రమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆ ముగ్గురికీ వివాహమైంది. వేటకెళ్లి తిరిగి వస్తావనుకుంటే, ఇలా వదిలిపెట్టి వెళ్లిపోతావా అంటూ భార్య చంద్రమ్మ రోదిస్తున్న తీరు అక్కడి వారిని కంట నీరు పెట్టించింది. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ బొమ్మిడి నయోమి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బొమ్మిడి సతీష్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి సాయం అందించేందుకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు దృష్టికి తీసుకెళ్తామని సతీష్ అన్నారు.


వేటకెళ్లిన బోటులోనే మృతిచెందిన మత్స్యకారుడు వెంకటేశులు

శెట్టిబలిజ పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి

విగ్రహావిష్కరణలో మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: శెట్టిబలిజ జాతిని జాగృతం చేసి, ఆ సామాజికవర్గ అభ్యున్నతికి అహర్నిశలూ కృషి చేసిన పితామహుడు దివంగత దొమ్మేటి వెంకటరెడ్డి అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ కొనియాడారు. అమలాపురం హైస్కూల్ సెంటర్‌లో నెలకొల్పిన దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని మంత్రి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ శెట్టిబలిజ సామాజికవర్గ అభివృద్ధి కోసం దొమ్మేటి వెంకటరెడ్డి చేసిన త్యాగాలు, ఉద్యమాలు అజరామరమని అన్నారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ తొలినాళ్లలో శెట్టిబలిజ సామాజిక వర్గాన్ని ఏకతాటిపైకి తెచ్చి వారి హక్కులను సాధించడంలో వెంకటరెడ్డి చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి శెట్టిబలిజ సంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై దివంగత దొమ్మేటి వెంకటరెడ్డి కీర్తిని కొనియాడారు. రాష్ట్ర దృశ్యకళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్యశైలజ, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని చంద్రశేఖర్ (బులినాని), పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, అమలాపురం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ముమ్మిడివరం జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శంకరరావు, మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్, వివిధ ప్రాంతాల శెట్టిబలిజ సంఘాల నేతలు దొమ్మేటి మీరాసాహెబ్ శెట్టి, దొమ్మేటి ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.


వెంకటరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్

ఉప్పుటేరులో మునిగి యువకుడి మృతి


మౌలాలీ మృతదేహం

కొత్తపల్లి: ఉప్పుటేరులో మునిగి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. విశాఖపట్నం జిల్లా పెద గంట్యాడ మండలం దేవాడ గ్రామానికి చెందిన షేక్ మౌలాలీ (22) తన కుటుంబ సభ్యులతో కలసి పొన్నాడలో బషీర్ బీబీ ఉరుసు ఉత్సవాలకు వచ్చాడు. ఆదివారం సాయంత్రం తన స్నేహితులతో కలసి పొన్నాడ శివారు రామన్నపాలెం ఉప్పుటేరులో ఈత కొట్టడానికి వెళ్లాడు. స్నేహితులంతా ఏరు దాటడంతో తనూ ఏరు దాటే సమయంలో ప్రమాదవశాత్తు మునిగిపోయి గల్లంతయ్యాడు. సోమవారం రామన్నపాలెం వద్ద మౌలాలీ మృతదేహం ఒడ్డుకు చేరింది. ఎస్సై స్వామినాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏం జరిగిందో ఏమో..

ఉరి వేసుకుని బాలిక ఆత్మహత్య


ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న వసంత

సీతానగరం: తెలిసీ తెలియని వయసు ఆ చిన్నారిది.. ఏం కష్టం వచ్చిందో తెలియదు కాని ఉరి వేసుకుని ఆత్మహత్యకు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చినకొండేపూడి పంచాయతీ పరిధి పెదకొండేపూడికి చెందిన ఈరేటి వసంత (10) అక్కడి ఎంపీపీ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతోంది. సోమవారం పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసిన అనంతరం ఒంటి గంటకు ఇంటి వద్ద మరికొన్ని పుస్తకాలు తెచ్చుకుంటానని ఆమె ఇంటికి వచ్చింది. ఈ నేపథ్యంలో తన పూరింట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల సహకారంతో బంధువులు సీతానగరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వసంతకు తండ్రి లేకపోవడం, తల్లి కాంతమ్మ మానసిక వికలాంగురాలు కావడంతో తల్లి మేనత్త అయిన హనుమంతుల నూకమ్మ వద్ద ఉంటోంది. అయితే స్కూల్‌కు వెళ్లి వచ్చి ఆ బాలిక ఎందుకు ఆత్మహత్యకు పాల్పడిందో, దానికి కారణాలేంటో తెలియరాలేదని.. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీతానగరం ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. వసంత మృతి ఘటన గ్రామంలో సంచలనం రేకెత్తించింది. దీనిపై స్థానికులు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

వాహనాల డ్రైవింగ్‌లో అప్రమత్తత అవసరం

ఆర్అండ్‌బీ ఎస్ఈ హరిప్రసాద్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రతిఒక్కరూ వాహలాల డ్రైవింగ్ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని ఆర్అండ్‌బీ ఎస్ఈ హరిప్రసాద్ అన్నారు. నెల రోజుల పాటు నిర్వహించిన రోడ్డు భద్రత మాసోత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హరిప్రసాద్ హాజరయ్యారు. వాహనం నడిపేటప్పుడు కచ్చితంగా నిబంధనలు పాటించాలని సూచించారు. ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి, క్షేమంగా గమ్యానికి చేరవచ్చన్నారు. కాకినాడ ఆర్టీఓ సాయిప్రసాద్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా ఈ మాసోత్సవాలు నిర్వహించారని తెలిపారు. పోలీసు, ఆర్అండ్‌బీ, వైద్యారోగ్య తదితర శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారన్నారు. విద్యార్థులతో వాక్‌థాన్, డ్రైవర్లకు కంటి పరీక్షలు, విద్యాసంస్థల్లో డ్రైవర్లు, హెల్పర్లు, సూపర్‌వైజర్లు, ప్రిన్సిపాళ్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని వివరించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏంవీఐలు హరినాథరెడ్డి, లక్ష్మీకిరణ్, ఏఎంవీఐలు షణ్ముఖ శ్రీనివాస్, కళాజ్యోతి, గౌరీశంకర్, చిన్నారావు, డాక్టర్ పద్మావతి పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఆర్టీఓ సాయి ప్రసాద్

కోళ్లలో బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవు

జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వెంకటరావు



అమలాపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కోళ్లలో బర్డ్ ఫ్లూనకు సంబంధించిన లక్షణాలు గాని, పక్షులలో మరణాలు గాని ఇప్పటి వరకూ నమోదు కాలేదని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వెంకటరావు తెలిపారు. ఇది మనుషులకు సంక్రమించే వ్యాధి కాదని, అందువల్ల ఎవరూ ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని వివరించారు. ఈ వ్యాధిని ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో మాత్రమే గుర్తించారని, వారం గడిచినా పక్క జిల్లాలు ప్రకాశం, కడప, చిత్తూరులలో ఈ వ్యాధి సోకినట్లు ఎటువంటి నివేదికలు అందలేదన్నారు. అందువల్ల కోనసీమ జిల్లాలో కోళ్లకు ఇటువంటి వ్యాధులు అంత త్వరగా సంక్రమించే అవకాశం లేదని వెంకట్రావు స్పష్టం చేశారు. అయినప్పటికీ ముందు జాగ్రత్త చర్యగా తమ సిబ్బందిని అప్రమత్తం చేశామని చెప్పారు. కోళ్ల ఉత్పత్తులు మాంసం, గుడ్ల ద్వారా ఈ వ్యాధి సంక్రమించదన్నారు. ఎందుకంటే పూర్తిగా ఉడికించి మాత్రమే తింటాం కాబట్టి ఎటువంటి ప్రమాదం జరగదన్నారు.

బంధువు మోసగించాడని వృద్ధురాలి ఫిర్యాదు

కాకినాడ సిటీ: ఇల్లు అమ్మి ఇచ్చిన సొమ్ము తిరిగి ఇవ్వకుండా, తన అక్క కొడుకు వేధిస్తున్నాడంటూ ఓ వృద్ధురాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాకు వలసల మీనన్ అనే 61 ఏళ్ల వృద్ధురాలు ఈ మేరకు వినతిపత్రం సమర్పించింది. బాధితురాలి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కేరళలో బంధువుల ఇంటి వద్ద మీనన్ ఉండేది. తన ఇల్లు అమ్మి బ్యాంకులో రూ.14 లక్షలు వేసింది. 2022 నవంబర్ 22న ఆమె అక్క సుమతి, ఆమె కొడుకు కల్లంపల్లి కృష్ణ తనకు ఫోన్ చేశారు. కృష్ణకు కాంట్రాక్ట్ వచ్చిందని, ఇల్లు అమ్మిన రూ.14 లక్షలు ఇస్తే, రూపాయి చొప్పున వడ్డీ ప్రతినెలా ఇస్తామంటూ తల్లీ, కొడుకులు నమ్మించారు. దీంతో బ్యాంకులో ఉన్న రూ.14 లక్షలను ఆర్‌టీజీఎస్ ద్వారా మీనన్ వారికి ఇచ్చింది. భర్త చనిపోవడం, పిల్లలు లేకపోవడంతో మీనన్ కాకినాడ రామారావుపేటలోని కృష్ణ ఇంటికి వచ్చింది.

డబ్బు విషయం అడిగితే, ఇస్తానంటూ మూడు నెలలుగా చెప్పుకుంటూ వచ్చాడు. చివరకు కృష్ణ, అతని భార్య రజియా డబ్బు ఇవ్వకపోగా, మీనన్‌ను హింసలకు గురిచేశారు. ఈ క్రమంలో తన సొమ్ము కోసం మీనన్ గతంలో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అప్పట్లో పెద్దల సమక్షంలో తగవు పెడితే, ఈ నెల 8న వడ్డీ రూ.84 వేలు ఇస్తానని,, అసలు డబ్బు జూలై నెలలో ఇస్తానంటూ కృష్ణ ఒప్పందపత్రం రాశాడు. ఇప్పుడు కృష్ణ, అతడి భార్య ఇష్టానుసారం మీనన్‌ను కొడుతున్నారు. తన డబ్బు ఇప్పించి, తనను రక్షించాలంటూ మీనన్ కలెక్టర్‌ను కోరారు. ఈ విజ్ఞాపనపై విచారణ జరపాలని పోలీసు అధికారులకు కలెక్టర్ సిఫార్సు చేశారు.

గోకవరంలో కిడ్నాప్ కలకలం

అరగంటలో ఛేదించిన పోలీసులు

గోకవరం: గోకవరంలో కిడ్నాప్ కలకలం రేపింది. ఒక మహిళను మరో ముగ్గురు మహిళలు కిడ్నాప్ చేయగా సమాచారం అందుకున్న పోలీసులు అర గంటలోనే కేసును ఛేదించారు. ఎస్సై కె.నాగరాజు కథనం ప్రకారం.. గోకవరం గ్రామానికి చెందిన ఓ వివాహితను కొవ్వూరుకు చెందిన ఇద్దరు మహిళలు, గోకవరానికి చెందిన ఓ మహిళ కలసి కిడ్నాప్ చేసేందుకు యత్నించారు. ఆ వివాహిత ఇంటికి కూతవేటు దూరంలో కారులో వేచి ఉండి ఆమెను బలవంతంగా ఆ ముగ్గురూ కారులో ఎక్కించుకుని తీసుకువెళ్లారు. కుటుంబ సభ్యులు ఆపే ప్రయత్నం చేసినప్పటికీ విఫలం కావడంతో భర్త దేవీవరప్రసాద్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందజేశారు. వెంటనే అప్రమత్తమైన ఎస్సై కిడ్నాప్‌కు గురైన మహిళ మొబైల్ నెంబర్ జీపీఎస్ ఆధారంగా దేవీపట్నం వెళ్లే మార్గంలో కారుని గుర్తించి మహిళను కిడ్నాపర్ల చెర నుంచి విడిపించారు. కిడ్నాప్ చేసిన ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకుని రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. ఓ యువకుడితో కిడ్నాప్‌కు గురైన వివాహిత ఇన్‌స్టాగ్రామ్‌లో చాటింగ్ ఈ కిడ్నాప్‌కు కారణమని ఎస్సై తెలిపారు. ఎంతో చాకచక్యంగా వ్యవహరించి అరగంటలోనే కేసును ఛేదించిన ఎస్సై నాగరాజు, ఇతర సిబ్బందిని ఉన్నతాధికారులు, మండల ప్రజాప్రతినిధులు తదితరులు అభినందించారు.